పోలింగ్ ప్రశాంతం



నాగరకర్నూల్ మంతటి పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

నాగర్‌కర్నూల్‌రూరల్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. ఉదయం ఆరు గంటలకు వివిధ పార్టీల ఏజెంట్లు ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ ప్రారంభించారు. తూడికుర్తిలో మాత్రం ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలింగ్ కేంద్రానికి నడవలేని వృద్ధులను ఆటోల సహాయంతో పోలింగ్ కేంద్రానికి తరలించారు.

అచ్చంపేట: నల్లమలలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. ఉదయం ఆరు గంటలకు వివిధ పార్టీల ఏజెంట్లు ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ ప్రారంభించారు. ఉదయం వాతావరణం చల్లబడటంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు 7 గంటలకే చేరుకున్నారు. ఆ తర్వాత ఎండవేడిమి మొదలు కావడంతో నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ మందకొండిగా సాగింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో అరగంట నుంచి 45 నిమిషాల పాటు ఆలస్యమైంది. వృద్ధులు, యువత, విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలు ఓటు హక్కును వినియోగించుకొన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి 19 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. బల్మూర్ మండలం మైలారం గ్రామంలో మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఓట్లు బహిష్కరించారు. అచ్చంపేట మండలం మార్లపాడుతండా 141, మన్నెవారిపల్లి 140 పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు మొరాయించాయి. నియోజకవర్గంలోని అచ్చంపేట, లింగాల ,అమ్రాబాద్, ఉప్పునుంతల, బల్మూర్, పదర, వంగూరు, చారకొండ మండలాల పరిధిలో 339 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేశారు.64.88 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళి పరిశీలించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 80.03శాతం ఓట్లు పోల్‌కాగా ప్రస్తుతం 64.88 శాతం మాత్రమే కావడం జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, ఆయన సతీమణి డాక్టరు అనురాధలు అమ్రాబాద్ మండలం ఎల్మపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు 104 పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.

కల్వకుర్తి రూరల్: మేజర్ గ్రామ పంచాయతీలు మార్చాల, రఘుపతి పేట, గుండూరు, తర్నికల్, తోటపల్లి గ్రామాల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలోని మార్చాల, ఎంగంపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి సందర్శించారు. ఇందిరాశోభన్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్‌లు ఆనంద్‌కుమార్, రాములు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కొల్లాపూర్: నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం చిన్నకార్పాముల గ్రామంలో బీజేపీ, కాంగ్రెస్, దేదినేనిపల్లి, మరికల్ గ్రామాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య గొడవలు మినహాయిస్తే అన్ని చోట్లా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

కొల్లాపూర్ రూరల్: మండలంలో 16 గ్రామ పంచాయతీలలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని మొలచింతలపల్లిలో అరగంట పాటు 19 బూత్‌లో ఈవీఎం మొరాయించింది.

తెలకపల్లి: మండలంలో మధ్యాహ్నం తర్వాత ఓటింగ్ మందకోడిగా సాగింది.

ఊర్కొండలో 81.31 శాతం

ఊర్కొండ: ఊర్కొండ మండలంలోని 22 పోలింగ్ కేంద్రాల్లో 81.31 శాతంగా ఓటింగ్ నమోదైంది.

తాడూరు: మండలంలోని మొత్తం 24 గ్రామ పంచాయతీలకుగాను 37 పోలింగ్ బూతుల ద్వార 28 వేల మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని 10 గ్రామ పంచాయతీలలో ప్రతి బూతు దగ్గర తాగునీరు, టెంట్, మెడికల్ కిట్ వంటి ఏర్పాట్లును చేశారు. ఓటు హక్కును ప్రజలు వినియోగించుకున్నారు.

కోడేరు: మండల వ్యాప్తంగా మొత్తం 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేసిన్నట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. 71, 74 వ పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం మొరాయించడంతో రెండు గంటల పాటు ఆలస్యంగా ప్రారంభమైంది.

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని వెంటేశ్వర్ల బావి గ్రామంలో రెండు ఈవీఎంలు మొరాయించి రెండు గంటలు ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభం మినహాయిస్తే అంతా ప్రశాంతంగా జరిగింది. 60 శాతం వరకు ఓట్లు పోలైనట్లు ఎన్నికల నిర్వాహకులు తెలిపారు.

72.86 పోలింగ్ నమోదు

వంగూరు: మండలంలోని 36 బూతుల్లో 33,167 ఓట్లకు గాను 24,167 ఓట్లు పోలయ్యాయి.

బిజినేపల్లి: బిజినేపల్లి మండలంలోని ఖానాపూర్‌లో బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు దిలీపాచారి దంపతులు గ్రామస్తులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. తిమ్మాజిపేట మండలంలోని నేరాళ్లపల్లిలో బీజేపీ రాష్ట్ర నాయకులు జక్కా రఘునందన్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఓటు వేశారు.

దోమలపెంటలో 47.5 శాతం

దోమలపెంట: దోమలపెంటలో 47.5 శాతం ఓటింగ్ శాతం నమోదైంది. ఈగలపెంట ఎస్ఐ వీరమల్లు ఆధ్వర్యంలో భద్రతను ఏర్పాటు చేశారు.

ఉప్పునుంతల: ఉప్పరిపల్లిలోని పోలింగ్ బూతు 68లో ఈవీఎం మొరాయించడంతో 45 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. మండలంలోని లక్ష్మాపూర్, పెద్దాపూర్ తదితర సమస్యాత్మక గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీస్‌భద్రతను ఏర్పాటుచేశారు.

మండలంలోని కాంసానిపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్ పరిశీలించారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో 12వ మాడల్ పోలింగ్ కేంద్రంగా ఎన్నికల అధికారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

మర్రికల్, దేవినేనిపల్లి, చినకార్పాముల గ్రామాలలో పోలింగ్ స్టేషన్‌ల వద్ద ఇరువర్గాల మధ్య చిన్నపాటి గొడవలు జరిగాయి. చినకార్పాములలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఘర్షణ పడి పెద్దకొత్తపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ముష్టిపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చింతలపల్లి జగదీశ్వర్‌రావు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటేసిన ప్రముఖులు



కొల్లాపూర్‌లో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి దంపతులు

కొల్లాపూర్/ఊర్కొండ: కొల్లాపూర్ పట్టణంలోని స్కాలర్స్ పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దంపతులు ఓటు వేశారు. ఊర్కొండ మండలం రేవెల్లి 265 బూత్లో జిల్లా పరిషత్ చైర్మన్ బి శాంత కుమారి రవీందర్ దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.



రేవల్లిలో సిరా గుర్తు చూపుతున్న జెడ్పీ చైర్మన్ దంపతులు

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు యెల్లేని సుధాకర్‌రావు తన స్వగ్రామమైన మహాసముద్రం గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.



మహాసముద్రంలో ఓటు వేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు యెల్లేని సుధాకర్‌రావు



తిమ్మజిపేట మండలం నేరెళ్లపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



తిమ్మాజిపేట మండలం నేరెళ్లపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి

క్లుప్తంగా

భరత్‌ప్రసాద్ విజయం తథ్యం

నాగర్‌కర్నూల్: పార్లమెంట్ ఎన్నికలలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ భారీ మెజార్టీతో గెలుస్తారని బీజేపీ అభ్యర్థి చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ జక్కా రఘునందన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బీజేపీని ఆదరించారని పేర్కొన్నారు. మూడు లక్షల మెజారిటీ ఖాయమని జోస్యం చెప్పారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

కల్వకుర్తి టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని జీఎస్‌ఆర్ కార్యాలయంలో ఆయన జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లురవి భారీ మెజారిటీతో గెలుస్తారని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ బాలు, పార్లమెంట్ ఎన్నికల కల్వకుర్తి అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఇందిరాశోభన్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, షానవాజ్, శ్రీకాంత్, సంతుమాదవ్, శివ, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడిపై దాడి

వంగూరు: వంగూరు మండలం కోనేటిపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రంగారావుపై అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు నరేందర్‌రావు, మరికొందరు దాడి చేశారు. విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎస్ఐ మహేందర్ గాయపడ్డ రంగారావును చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. రంగారావును కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ బాలాజీసింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి, వంగూరు జెడ్పీటీసీ సభ్యులు కేవీఎన్‌రెడ్డి తదితరులు పరామర్శించారు.

ఓటు వేసిన ప్రవాస భారతీయుడు



ఉప్పరిపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎన్ఆర్ఐ బొజ్జ అమరేందర్‌రెడ్డి

అచ్చంపేట రూరల్: లోక్‌సభ ఎన్నికల కోసం ఉప్పునుంతల మండలం ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన బొజ్జ అమరేందర్‌రెడ్డి విదేశాల(అమెరికా) నుంచి తరలి వచ్చారు. రూ.లక్షలు ఖర్చు చేసి, రోజుల తరబడి ఉద్యోగాలకు సెలవు పెట్టి ఒక్క ఓటు కోసం వేల కిలోమీటర్లు విమాన ప్రయాణం చేసి వచ్చిన ఆయనను గ్రామస్తులు అభినందించారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఎస్పీ



తాడూరులో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ గైక్వాడ్ రఘునాథ్‌వైభవ్

మండల కేంద్రంలోని 249, 250 పోలింగ్ కేంద్రాలను ఎస్పీ గైక్వాడ్ రఘునాథ్‌వైభవ్ సందర్శించారు. పోలింగ్ కేంద్రంలోని వివరాలు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

వెల్దండ: మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రవికుమార్ పరిశీలించారు. రాఘయపల్లిలో రాష్ట్రఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండల కేంద్రంలో అదే విధంగా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ ఓటు వేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెర్కూర్, వెల్దండలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.



రాఘయపల్లిలో ఓటువేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

కల్వకుర్తి/కల్వకుర్తి టౌన్: నియోజకవర్గంలో మెత్తం 72.51 శాతం పోలింగ్ నమోదైంది. పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలలోని బీఎల్‌ఓలు ఓటర్లకు పోల్‌చిట్టీలు అందచేయలేదు. పట్టణంలోని బలరాంనగర్ కాలనీలోని 91వ పోలింగ్ కేంద్రంలో మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఈవీఎంలో సాంకేతిక లోపం రావటంతో పోలింగ్ నిలిచిపోయింది. అరగంట తర్వాత సెక్టార్ ఆఫీసర్ బాసునాయక్ వెంటనే మరో ఈవీఎంను బిగించి పోలింగ్ ప్రారంభం అయ్యేలా చేశారు. పట్టణంలోని పోలింగ్ కేంద్రంలో మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్ ఆయన కుటుంబసభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు.



కల్వకుర్తిలో క్యూలైన్ లో నిల్చున్న ఓటర్లు

ఎంపీ రాములు తన సొంత గ్రామం కల్వకుర్తి మండలంలోని గుండూర్‌లో, తన కుమారుడు బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌తో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పటిష్ట బందోబస్తు



బల్మూర్ మండలం మైలారంలో ఓట్ల బహిష్కరించడంతో ఓటర్లు కోసం ఎదురు చూస్తున్న ఎన్నికల సిబ్బంది

నక్సల్స్ ప్రభావిత, సమస్యాత్మక గ్రామాల్లో ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారయంత్రాంగం అదనపు బలగాలను మోహరించారు. అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐ రవీందర్, ఎస్ఐలు పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు. మూడు కంపెనీల కేంద్ర బలగాలతో పాటు కర్ణాటక పోలీసులు, సీఆర్‌పీఎఫ్ అదనపు బలగాలను రప్పించారు. ఈ ఎన్నికల్లో 800 మంది పోలీసు సిబ్బంది పనిచేశారు.



అచ్చంపేటలో ఓటేసిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

ఓటింగ్ సరళిని పరిశీలించిన అభ్యర్థులు



పెంట్లవెల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

తాడూరు/కల్వకుర్తి రూరల్/వెల్దండ: తాడూరు మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి పరిశీలించారు. ఓటింగ్ సరళిని కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. కల్వకుర్తి మండలంలోని తాండ్ర గ్రామాన్ని సందర్శించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కాయతీ ఆశాదీప్‌రెడ్డి, కాయతీ విజయ్‌కుమార్‌రెడ్డిలతో పోలింగ్ సరళిపై చర్చించారు. వెల్దండ మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రాలను బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. కార్యకర్తలతో ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

తెలకపల్లి: బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పట్టణంలోని పోలింగ్ బూతులను పరిశీలించారు. తెలకపల్లిలో పోలింగ్ బూతును మల్లురవి సందర్శించారు. బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ మండలంలోని ఆయా గ్రామాలను సందర్శించి ఓటు సరళిని అడిగి తెలుసుకున్నారు.

69 శాతం పోలింగ్



జూపల్లిలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న మహిళలు

చారకొండ: మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు సంబంధించి 21 పోలింగ్ కేంద్రాలో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. జూపల్లి, చారకొండ , తిమ్మాయిపల్లిలో తహసీల్దార్ ప్రమీల పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. 69 శాంతం పోలింగ్ నమోదైంది. మండల కేంద్రంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చారకొండ వెంకటేష్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.



నాగర్‌కర్నూల్‌లో 118వ పోలింగ్ కేంద్రంలో ఓటేసిన మాజీ మంత్రి నాగం దంపతులు



మార్చాలలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



తెలకపల్లి గౌరారంలో ..



ఊర్కొండలో..



చూపుడు వేలును చూపుతున్న పెంట్లవెల్లి మండలం ఎంగంపల్లితండా యువకులు



కోడేరులో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు



మన్ననూరులో ఓటు హక్కును వినియోగించుకున్న యువకులు



బిజినేపల్లి మండలం ఖానాపూర్ గ్రామస్తులతో బీజేపీ సీనియర్ నాయకుడు దిలీపాచారి



దోమలపెంట పోలింగ్ కేంద్రం వద్ద ఎస్ఐ, సిబ్బంది



ఉప్పునుంతల మండలం కాంసానిపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ రామేశ్వర్



పెద్దకొత్తపల్లిలో పోలింగ్ స్టేషన్ వద్ద బారులు తీరిన ఓటర్లు



ముష్టిపల్లిలో ఓటు వేసిన రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్



మార్చాలలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కుడికిల్లలో బారులుతీరిన మహిళలు



వీల్ చైర్‌లో వచ్చి ఓటు వేసి వెళ్తున్న వృద్ధురాలు



కొల్లాపూర్‌లో

మొదటిసారి ఓటేశా..

కల్వకుర్తి టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో కొత్తగా ఓటరుగు నమోదు అయిన యువత ఓటు హక్కును వినియోగించుకొని సంబురపడ్డారు. ప్రజాస్వామ్యంలో మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు యువత ముందుకు రావాలి. మొదటి సారి ఓటు వేసినందుకు ఎంతో సంతోషంగా ఉంది.



మధుమిత, కల్వకుర్తి

హైఓల్టేజీతో కాలిన వస్తువులు

కోడేరు: మండలంలోని జనుంపల్లిలో సోమవారం తెల్లవారు జామున హై ఓల్టేజీ కరెంట్ రావడంతో టీవీలు, ఫ్యాన్లు, ఏసీలు, బల్బులు, ట్యూబ్‌లైట్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయావని బాధితులు వాపోయారు. దాదాపుగా 40 మంది ఇళ్లలో వస్తు సామగ్రి కాలిపోయావని తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లిలో ఇరు వర్గాలు ఘర్షణ పడిన ఘటనలో సోమవారం కేసు నమోదైనట్లు ఎస్ఐ వేణు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బుసిరెడ్డిపల్లిలో పాత కక్షలతో నరేష్, శేఖర్ అనే ఇద్దరు వ్యక్తులు గొడవపడ్డారు. ఘర్షణలో ఇరువురికి గాయాలయ్యాయి. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హజ్ యాత్రికులకు సన్మానం

ఆత్మకూర్: ముస్లింల అత్యంత పవిత్రమైన హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులను ముస్లింలు ఘనంగా సత్కరించారు. సోమవారం రాత్రి స్థానిక జియాఉల్‌ఖురాన్ మదర్సాలో అఫ్తాబ్, అజ్జర్‌లను సన్మానించారు.

ఏకలవ్య పాఠశాలల్లో 100శాతం ఉత్తీర్ణత



టాపర్‌గా నిలిచిన చరణ్

వెల్దండ: మండలంలోని గుండాల ఏకలవ్య పాఠశాలల్లో 10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు ప్రిన్సిపాల్ సరస్వతి పేర్కొన్నారు. సోమవారం సీబీఎస్సీ ఎస్ఎస్‌సీ ఫలితాలు వెలువడ్డాయి. ఏకలవ్య పాఠశాలల్లోని 65మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పాఠశాలలో ముడావత్ చరణ్ 575/700 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచారు. అదేవిధంగా చంటి 554 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచారు.

రోడ్లపై ధాన్యం..ప్రయాణికుల అవస్థలు

కోడేరు: మండలంలోని జనుంపల్లి శివారులో మంత్రాలమ్మ ఆలయం దగ్గర బావాయిపల్లి ప్రధాన రోడ్లపై వరి ధాన్యం, మొక్కజొన్న పంటలను రైతులు బీటీ రోడ్డుపై ఆరబెట్టడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి వేళల్లో రైతులు ధాన్యం కుప్పలుగా పోసి కవర్లు కప్పడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత సంవత్సరం రోడ్లపై ధాన్యం ఆరబెట్టడంతో ద్విచక్ర వాహనం నుంచి కింద పడి ఇద్దరూ మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



జనుంపల్లి మంత్రాలమ్మ వద్ద రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యం